క్లుప్తంగా

వసతి గృహాలను వినియోగించుకోండి



ప్రభుత్వ పథకాలతో ఏర్పాటు చేసిన బ్యానర్

నరసన్నపేట: పేద విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో విద్యను అందించేందుకు వసతి గృహాలు ప్రభుత్వం నిర్వహిస్తుందని, వీటిని వినియోగించుకోవాలని స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహం మేట్రిన్ ప్రభావతి కోరారు. 3 నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు చేరవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ బాలికలకు ఎక్కువ సీట్లు ఖాళీలు ఉన్నాయని, తల్లిదండ్రులు గమనించి జాయిన్ చేయించాలన్నారు. ఈ మేరకు గ్రామాల్లో ప్రచారం చేపట్టామని, వసతి గృహం బయట ప్రభుత్వం అమలు చేస్తున్న సౌకర్యాలతో బ్యానర్ పెట్టామన్నారు. బీసీ విద్యార్థినులకు కూడా పది సీట్లు ఉన్నాయన్నారు.

శ్రీనిధి లక్ష్యం రూ.7.50 కోట్లు



మాట్లాడుతున్న శ్రీనిధి మేనేజర్ లక్ష్మణరావు

నరసన్నపేట: మండలంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి శ్రీనిధి రుణాల లక్ష్యం రూ.7.50 కోట్లుగా నిర్ధారించామని, ఈ మేరకు లక్ష్యం పూర్తి చేయాలని జిల్లా శ్రీనిధి మేనేజర్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండలంలో ఉన్న సీఎఫ్‌లు, సీసీలు, ఇతర వెలుగు సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో రూ.7 కోట్లు లక్ష్యంగా నిర్ధారించగా.. దీనిని పూర్తి చేశారని అభినందించారు. మండల సమాఖ్యకు, గ్రామ సంఘాలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం లక్ష్యం కూడా పూర్తిచేసి, స్వయం శక్తి మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదపడాలన్నారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్ష, కోశాధికారులు చింతు శ్రీదేవి, లుకలాపు కళావతి, ఏపీఎం సాయి లక్ష్మి, హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

సంఘాలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ఏపీఓ శ్రీరామచంద్రమూర్తి

హిరమండలం: స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయాలని ఏపీఓ వి.శ్రీరామచంద్రమూర్తి అన్నారు. మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఏపీఓ మాట్లాడుతూ మండలంలో నూతన సంఘాలను ఏర్పాటుచేయాలన్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో కట్టించి రాయితీలు పొందాలన్నారు. స్త్రీనిధి రుణంతో పాటు ఇతర రాయితీలు, సౌకర్యాలపై అవగాహన కల్పించారు. రికార్డులను పక్కాగా నిర్వహించాలని.. ఎక్కడా లోపాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



విద్యార్థులకు సూచనలిస్తున్న వైద్య సిబ్బంది

జలుమూరు: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులైన జ్వరం, డయేరియా, దగ్గు తదితర వాటిపై విద్యార్థులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని జలుమూరు పీహెచ్‌సీ మెడికల్ అధికారి తాడేల శ్రీకాంత్ అన్నారు. మండల కేంద్రం జలుమూరు కేజీబీవీలో విద్యార్థులకు ఆరోగ్యంపై సోమవారం అవగాహన కల్పించారు. మనతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు రక్త పూత నమూనాలు సేకరించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. కేజీబీవీ ఎస్ఓ ఎ.యశోద, సీహెచ్ఓ పద్మావతి, హెచ్ఎస్ చిన్నరాజులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్లు పంపిణీ

బూర్జ: మండలంలోని కొల్లివలస డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగ్‌లు, కిట్లు సోమవారం పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావు, తెలుగు యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనెపు రామకృష్ణనాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ కె.గాయత్రి, ఇన్‌చార్జి ఎ.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మం గొప్పది

సరుబుజ్జిలి: సనాతన ధర్మం గొప్పదని, ప్రతి ఒక్కరూ భగవద్గీతను పఠించాలని ప్రబోధ సేవా సమితి కమిటీ అధ్యక్షుడు గుండ జనార్దనరావు తెలిపారు. మండలంలోని చినమతల బుపేట గ్రామంలో హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం భగవద్గీతను ప్రచారం నిర్వహించారు. కమిటీ సభ్యులు లక్ష్మీకుమారి, తాతయ్య, భాస్కరరావు పాల్గొన్నారు.

● శ్రీముఖలింగంలో ప్రత్యేక పూజలు



జలుమూరు మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన శ్రీముఖలింగంలో జ్యేష్ఠమాసం సోమవారం స్వామి వారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఏకవార అభిషేకాలు, అర్చనలు, దర్శనాలు నిర్వహించారు. వారిహి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి, అనంతరం గోలెం వద్ద మొక్కులు తీర్చుకున్నారు. పవిత్ర వంశధార నదిలో పుణ్యస్నానాలు ఆచరించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. - జలుమూరు

● బాగుచేశారు..



నరసన్నపేట మండలంలోని సాగునీటి కాలవలు అభివృద్ధికి నోచుకుంటున్నాయి. అధ్వానంగా తయారైన సాగునీటి కాలువలను ఉపాధి హామీ పథకం ద్వారా బాగు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 110 కాలువల్లో ఇప్పటివరకు జంగిల్, పూడికలు తొలగించి అభివృద్ధి చేశామని ఏపీఓ యుగంధర్ తెలిపారు. - నరసన్నపేట

● సామూహిక సత్య వ్రతాలు



పాతపట్నం ఆల్‌ఆంధ్ర రోడ్డు సమీపంలోని షిర్డీ గిరిపై ఉన్న సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ 18వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా బాబా ధ్యాన మందిరంలో సోమవారం 1008 మంది భక్తులతో సామూహిక సత్య వ్రతాలు నిర్వహించారు. పాతపట్నం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. - పాతపట్నం

పారిశుద్ధ్య పనులు చేపట్టండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

నరసన్నపేట: మండల పరిధిలోని 34 పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ రామకృష్ణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పారిశుద్ధ్యం, మంచినీటి సమస్యలపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు ఏయే పంచాయతీల్లో ఎక్కడెక్కడ పనులు చేపట్టారో పంచాయతీ కార్యదర్శులకు అడిగి తెలుసుకున్నారు. కొన్ని పంచాయతీల్లో ఇప్పటివరకు పనులు చేపట్టకపోవడాన్ని తీవ్రంగా పరిగణించారు. విధిగా జిల్లా కలెక్టర్ ఆదేశాలను పాటించాలన్నారు. మురుగు నీటి నిల్వ ఉండకుండా చూడాలని ఆదేశించారు. తాగునీటి ట్యాంక్‌లను శుభ్రం చేయాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉదయభాస్కర్ మాట్లాడుతూ తాగునీటి సమస్య ఎక్కడెక్కడ ఉందనేది అడిగి తెలుసుకున్నారు. జల్ జీవన్ పనులు పూర్తయిన గ్రామాల్లో నీటిని సక్రమంగా ప్రజలకు అందించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనన్నారు. తాగునీటి సమస్యపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉపాధి ఏపీఓ యుగంధర్, ఆఫీస్ సూపరింటెండెంట్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



ఆమదాలవలస: బెలమాంలో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న దృశ్యం



కొత్తూరు: అల్లు వీధిలో కాలువలను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ఆమదాలవలస: మండలంలోని బెలమాం, లొద్దలపేట గ్రామాల్లో సర్పంచ్ కనుగుల కిశోర్ ఆధ్వర్యంలో సోమవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మురుగు కాలువల్లో చెత్తను తొలగించి క్లోరినేషన్ చేపట్టారు. గ్రామంలోని రహదారులపై నిలిచిన నీటిని తొలగించి దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ చల్లారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా పంచాయతీలోని ప్రజలందరూ సహకరించాలని కోరారు.

కొత్తూరులో..

కొత్తూరు: మండల కేంద్రంలో సోమవారం పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. సర్పంచ్ పడాల కృష్ణవేణి పర్యవేక్షించారు. మురుగు కాలువల్లో పేరుకపోయిన చెత్తను తొలగించారు. రోడ్లుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, చెత్తలను తొలగించారు. ఎంపీడీఓ త్రివిక్రమరావు పరిశీలించారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



కొత్తూరు: జగదాంబ సరస్వతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భక్తులు



మెళియాపుట్టి: సందేశాన్ని అందిస్తున్న ఓంశాంతి బ్రహ్మకుమారీలు

మెళియాపుట్టి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన, చక్కటి నడవడిక కలిగి ఉండాలని ఓంశాంతి బ్రహ్మకుమారి సుధ అన్నారు. జగదాంబ సరస్వతి స్మృతి దినాన్ని పురస్కరించుకుని సోమవారం మండలంలోని చాపర త్రిలోక్ భవన్‌లో పలు గ్రామాల ప్రజలకు ఆధ్యాత్మిక చింతనపై సందేశాన్ని అందించారు. ప్రస్తుత దైనందిన జీవితంలో ప్రజలు ఆధ్యాత్మిక చింతనకు దూరమై.. ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. ప్రశాంత వాతావరణంలో ప్రతిఒక్కరూ జీవించాలని పిలుపునిచ్చారు. అనంతరం ధ్యానం చేయించారు. త్రిలోక్ భవన్‌లో నిర్వహిస్తున్న యోగా.. ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రతిఒక్కరూ హాజరవ్వాలని కోరారు.

కొత్తూరులో..

కొత్తూరు: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని కొత్తూరు ఓం శాంతి ధ్యాన మందిరం ఇన్‌చార్జి ఈశ్వరాయి బ్రహ్మకుమారి పద్మ అన్నారు. ధ్యాన మందిరంలో సోమవారం జగదాంబ సరస్వతి 59వ స్మృతి దినోత్సవం నిర్వహించారు. జగదాంబ సరస్వతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ దైవ గుణాలు కలిగి ఉండాలన్నారు.

నాణ్యమైన విద్యా బోధనే లక్ష్యం



సమీక్ష నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా బోధన సిబ్బంది కృషిచేయాలని దుప్పలవలస అంబేడ్కర్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బోర బుచ్చిరాజు అన్నారు. దుప్పలవలస ప్రిన్సిపాల్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రిన్సిపాల్ దువ్వాడ దేవేంద్రరావు ఉద్యోగోన్నతిపై గ్రేడ్–1 ప్రిన్సిపాల్‌గా తూర్పుగోదావరి బదిలీ అయ్యారు.

దరఖాస్తుల ఆహ్వానం..

దుప్పలవలస అంబేడ్కర్ గురుకులంలో మిగులు సీట్లుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బోర బుచ్చిరాజు తెలిపారు. 6, 7, 8, 9వ తరగతుల్లో మిగులు సీట్లుకు ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 29వ తేదీన ఉదయం 10 నుంచి 11 గంటలు వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

డయేరియాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో నీటి నిల్వలతో డయేరియా ప్రబలే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ గూనపాలెం ప్రాజెక్టు సూపర్‌వైజర్ బి.యోగీశ్వరి అన్నారు. పాతగూనపాలెం, కొత్త గూనపాలెం, చెరువుగట్టు, ఎల్‌బీఎస్ కాలనీ తదితర ప్రాంతాల్లో డయేరియాపై అంగన్‌వాడీ కేంద్ర సిబ్బంది ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యోగీశ్వరి మాట్లాడుతూ.. నీటి నిల్వలు లేకుండా చూడాలని, మరిగించిన నీటిని చల్లార్చి తాగాలని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు టి.రాజేశ్వరి, బి.ఆదిలక్ష్మి, హైమరత్నం, సమీమ, హెల్పర్స్ జె.పావని, కె.నాగమణి ఉన్నారు.

నేడు మండల సమావేశం

పాతపట్నం: ఈ నెల 25వ తేదీన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ దోర సావిత్రమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ కె.రామకృష్ణ రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మండల అధికారులు పూర్తిసమాచారంతో హాజరుకావాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

బూర్జ: మండలంలోని కొల్లివలస డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ గురుకులం విద్యాలయంలో 2024–25 సంవత్సరంలో 6, 7, 8, 9వ తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ.లక్ష్మణరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతిలో ఎస్సీ–13, ఎస్టీ– 2, బీసీ–2, ఓసీ–1, 7వ తరగతిలో ఎస్సీ–7, ఓసీ–1, 8వ తరగతిలో ఎస్సీ–2, ఎస్టీ– 3, ఓసీ–1, 9వ తరగతిలో ఎస్సీ–2, ఎస్టీ–4, ఓసీ–1 సీటు ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలు లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 29వ తేదీ ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కొల్లివలస గురుకులంలో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రానికి 9 గంటలకే చేరుకోవాలన్నారు. మార్కుల ఆధారంగా సీట్లు భర్తీ చేస్తామన్నారు.

విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చర్యలు

ఎల్.ఎన్.పేట: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు విత్తనాలు, ఎరువులు కొరత రాకుండా చర్యలు తీసుకున్నామని ఏఓ పైడి లతశ్రీ తెలిపారు. తన కార్యాలయంలో గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులతో సోమవారం సమావేశమయ్యారు. ఇప్పటికే మండంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు సరఫరా చేశామన్నారు. ఎరువుల సరఫరాకు ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు అవగాహన కల్పించి ఎరువులు కావాలసిన రైతుల వివరాలను ముందుగానే నమోదు చేసుకోవాలన్నారు. నగదు చెల్లించే రైతులకు ఎరువులు సరఫరా చేసేందుకు సిద్ధం కావాలన్నారు. ఎరువులు, సాగునీటి యాజమాన్య పద్ధతులు, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులకు తగిన సూచనలు, సలహాలు తెలియజేయాలన్నారు.

విద్యార్థుల ప్రతిభ



పతకాలు, ప్రశంసాపత్రాలను అందిస్తున్న ప్రిన్సిపాల్ శామ్యూల్ లంక

జి.సిగడాం: స్థానిక ఏపీ మోడల్ స్కూల్, కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఒలంపియాడ్ నేషల్ లెవెల్ (గత ఏడాది)లో నిర్వహించి పోటీ పరీక్షలో ప్రతిభ కనపర్చారు. మ్యాథ్స్ విభాగంలో 20 మంది విద్యార్థులు హాజరవ్వగా 8 మంది బంగారు, 8 మంది వెండి పతకాలను సాధించారన్నారు. సైన్స్ విభాగంలో 16 మంది బంగారు, వెండి పతకాలతో సత్తా చాటారన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లంక, అధ్యాపకుడు జగదేష్, విద్యాలయం సిబ్బంది సోమవారం విద్యార్థులకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు.

రిమ్స్ అన్నపూర్ణకు రూ.10 వేల విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్ అన్నపూర్ణ నిత్య అన్నదాన పథకానికి హయాతీనగరానికి చెందిన విశ్రాంత పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిల్లాన మాధవరావు, లక్ష్మి దంపతుల కుమారుడు సంతోష్‌బాబా పుట్టిన రోజు సందర్భంగా రూ.10 వేలు విరాళం ప్రకటించారు. విరాళం మొత్తాన్ని సంఘం కార్యదర్శి ఫాల్గుణరావు ద్వారా సంఘ అధ్యక్షులు గంగుల రమణబాబు, జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరరావులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సేవా కోఆర్డినేటర్ పప్పల నాగేశ్వరరావు, రాష్ట్ర, జిల్లా భజన ఇన్‌చార్జి పి.గంగాధర, బ్యాంకర్స్ కాలనీ కన్వీనర్ అల్లాడ ప్రసాదరావు ఉన్నారు.

పార్టీ శ్రేణులకు అండగా ఉంటా..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

● పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు, పార్టీ అభిమానులకు అండగా ఉంటానని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. సోమవారం పాతపట్నంలోని తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తగా కొలువు దీరిన టీడీపీ ప్రభుత్వం ఆచరణ సాధ్యం కానీ హామీలను ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. మనం చేసిన మంచి పనులు ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎంపీపీలు దొర సావిత్రమ్మ, రెడ్డి జ్యోతిలక్ష్మి, కొత్తూరు, ఎల్.ఎన్.పేట జెడ్పీటీసీలు కామక భాగ్యలక్ష్మి, త్రినాథులు, నాయకులు ఎం.శ్యామ్‌సుందరరావు, సవిరిగాన ప్రదీప్, సూర్యం, బాలరాజు, రెడ్డి రామారావు, సి.హెచ్.సూర్యనారాయణ, ఎ.వి.సురేష్, తాతయ్య, రమేష్‌బాబు, పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



సరుబుజ్జిలి: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు



హిరమండలం: నువగడలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: బడిఈడు పిల్లలు బడిలో చేరాలని ఎంఈఓలు కె. శ్రీనివాసరావు, డి.బాలరాజు అన్నారు. మండలంలోని కొత్తకోట గ్రామంలో మేం బడికి పోదాం కార్యక్రమాన్ని విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. సర్వ శిక్ష అభియాన్ ఆదేశాల మేరకు జూలై 12 వరకు ఈ కార్యక్రమం ద్వారా బడిబయట పిల్లలను గుర్తించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కొత్తకోట హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ పైడి మురళీకృష్ణ, సీఆర్ఎమ్‌టీలు చిన్నారావు, చిరంజీవి, రోహిణి, రామినాయుడు పాల్గొన్నారు.

హిరమండలం: బడిఈడు కలిగిన పిల్లలు పాఠశాలల్లో ఉండాలని ఎంఈఓ.కె. రాంబాబు అన్నారు. సోమవారం నువగడ, గొట్టా ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలించారు. నువగడలో నేను బడికిపోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యాకానుక కిట్లను విద్యార్థులు అందరికీ అందేలా చర్యలు చేపట్టామన్నారు. నాడు–నేడు పనుల పెండింగ్‌పై దృష్టి సారించినట్లు చెప్పారు. మధ్యాహ్న భోజన పథకం కూడా సక్రమంగా అమలుచేయాలని.. మెనూ పాటించాలని ఆదేశించారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు, సీఆర్పీ శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సెల్‌ను వినియోగించుకోండి



గ్రీవెన్స్‌కు హాజరైన అధికారులు

నరసన్నపేట: ప్రతీ సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహిస్తామని, మండల స్థాయి అధికారులు హాజరవుతారని, దీనిని వినియోగించుకోవాలని నరసన్నపేట ఎంపీడీఓ రామకృష్ణ కోరారు. సోమవారం మొదటిసారిగా మండల పరిషత్ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించామని, ఒక్క ఫిర్యాదు కూడా రాలేదన్నారు. ఇకనుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రీవెన్స్ నిర్వహిస్తామని, సమస్యలు నేరుగా తెలియజేయవచ్చన్నారు. గ్రీవెన్స్‌కు ఏఓ కె.సునీత, ఏపీఓ యుగంధర్, ట్రాన్స్‌కో, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ ఏఈలు కోటేశ్వరరావు, రాజశేఖర్, మోహన్‌రావు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమణమ్మ, పశువైద్యాధికారులు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్య పరిష్కరించాలి



వినతిపత్రాలు అందిస్తున్న దృశ్యం

కొత్తూరు: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలోకి మురుగునీటి సమస్య పరిష్కరించాలని, నేరడిలో ఓల్టేజ్ సమస్య తీర్చాలని, నివగాం ఎస్సీ వీధి నుంచి పట్నాన వీధి వరకు సీసీ డ్రైన్ నిర్మించాలని వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు తదితరులు వినతిపత్రాలు అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ త్రివిక్రమరావు మీ కోసం పేరుతో సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. కుంటిభద్ర చెరువులో పూడిక తీయించాలని తీమర జగదీశ్వరరావు వినతి పత్రం అందించారు. మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సుదర్శన క్రియతో మానసిక ప్రశాంతత



ముగింపు కార్యక్రమంలో సాధకులు

శ్రీకాకుళం కల్చరల్: సుదర్శన క్రియ సాధన వలన మానసిక, ఆరోగ్య ప్రయోజనాలు అనేకం ఉన్నాయని, మనలో నైపుణ్యత వెలికి తీయడమేకాంకుడా ఒత్తిడి లేని జీవితాన్ని సొంతం చేస్తుందని బెంగళూరుకు చెందిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ సీనియర్ ఫ్యాకల్టీ గోపిజీ అన్నారు. నగరంలోని కృష్ణా పార్కువద్దగల రాయల్ ప్లాజాలో నాలుగు రోజులు జరిగిన సుదర్శ క్రియ శిక్షణ ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి పరిస్థితులనైనా చిరునవ్వుతో సమస్యను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. అహంకారాన్ని విడిచి పెడితే, చాలా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. జీవితంలో వచ్చే అనేక ఒడిదుడుకులను కూడా చిరునవ్వుతో ఎదుర్కోవడమే ఆర్ట్ ఆఫ్ లివింగ్ అన్నారు. సీనియర్ టీచర్ నంబాళ్ల కల్పన సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో 35 మంది శిక్షణ పొందారు. అనంతరం జరిగిన సత్సంగంలో సింగర్స్ చౌదరి శ్రీనివాస్, పెంకి నాగేశ్వరరావు, సింహాద్రి శ్రీనివాసరావు బృందం పాడిన నందన నందన రాధే శ్యామా, గోవింద గోపాల గురు ఓం తదితర భక్తి భజన గీతాలు, పాటలు అలరించాయి. డీడీసీ సభ్యులు బి.వి.రవిశంకర్, వరదా వెంకట ఆనంద్, సీనియర్ టీచర్లు కొఠారి రేణుక, దేసూళ సురేంద్ర, ఎస్‌పీఏ పోలినాయుడు, వలంటీర్లు కె.ఆదినారాయణ, నటుకుల మోహన్, గుమ్మా వాసు, శంకర్ పాల్గొన్నారు.